సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 47 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.18

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18, కనిష్టం రూ.4, సరాసరి రూ.10 పలికింది.



జిల్లా అంతటా శుక్రవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడా గ్రామం మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయి. నేడు ఎస్పీ ఫకీరప్ప ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభిస్తారు. తొలి మ్యాచ్ సీనియర్ విభాగంలో వాణి డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల జట్ల మధ్య జరుగుతుంది.

చెరువులో పూడికతీత పనులు చేపట్టండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

కదిరి అర్బన్: వితలరాయుని చెరువులో నీరు తగ్గాక ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడిక తీత పనులు చేపట్టాలని డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పనులు చేసే ప్రాంతంలో సౌకర్యాలు, కూలి డబ్బుల చెల్లింపు గురించి కూలీలను ఆరా తీశారు. అనంతరం కొండ ప్రాంతంలో జరుగుతున్న ట్రెంచ్ పనులను పరిశీలించి, కూలీల హాజరును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ రెహానాబేగం, ఏపీఓ శ్రీధర్‌రెడ్డితో పాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సీకేపల్లి ఎంపీపీగా మజ్జిగ అంజలి



నూతన ఎంపీపీ మజ్జిగ అంజలికి డిక్లరేషన్ ఫాం అందజేస్తున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) గంగినేపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మజ్జిగ అంజలి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నేకొత్తపల్లి ఎంపీపీ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ కాగా, నాగసముద్రం ఎంపీటీసీ సభ్యురాలు ప్రవీణ ఎన్నికయ్యారు. ఆమె ఇటీవల పదవికి రాజీనామా చేయడంతో...నూతన ఎంపీపీ ఎన్నిక కోసం శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి లక్ష్మానాయక్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 13 మంది ఎంపీటీసీ సభ్యులంతా అధిష్టానం నిర్ణయం మేరకు మజ్జిగ అంజలికి ఏకగ్రీవంగా మద్దతు తెలపడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ఎంపీటీసీలు, నాయకులు నూతన ఎంపీపీ మజ్జిగ అంజలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ నాయక్, జెడ్పీటీసీ సభ్యుడు గోవింద రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీ గాయత్రి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్

- 11 టన్నుల ఎరువులు సీజ్, ఓ దుకాణం లైసెన్స్ రద్దుకు ఆదేశం



రొద్దంలో ఓ దుకాణంలో ఎరువులు సీజ్ చేస్తున్న అధికారులు


రొద్దం: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రికార్డులు, బిల్లు బుక్కులు పరిశీలించారు. అనంతరం విజిలెన్స్ అధికారి వాసు ప్రకాష్ మాట్లాడుతూ... అధికారులు రైతుల వేషంతో ఎరువుల దుకాణాలకు వెళ్లి డీఏపీ ఎరువులు కొనుగోలు చేయగా, దుకాణదారులు ఎమ్మార్పీకి మంచి అధికంగా వసూలు చేశారన్నారు. దీంతో రెండు దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అదేవిధంగా ఓ దుకాణం లైసెన్స్ రద్దు చేయాలని స్థానిక ఏఓ నివేదితకు సూచించామన్నారు. అలాగే రూ 3.10 లక్షల విలువల చేసే 11.5 టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు వివరించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించిన వారిపై 6(ఏ) కింద కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ కోర్టులో ప్రవేశపెడతామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐ బాలకృష్ణయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి అంజాద్, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుళ్లు ఈశ్వరయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

ఛీప్ లిక్కర్ సిద్దయ్య!

అధికారంలో ఉన్నన్నాళ్లు అడ్డదారుల్లో సంపాదించుకున్న టీడీపీ నేతలు... ప్రతిపక్షంలోనూ అదే పంథా కొనసాగించారు. డబ్బులొస్తాయంటే ఏ పనైనా చేసేందుకు వెనకాడటం లేదు. ఇసుక, మద్యం అక్రమ రవాణా చేస్తూ నాలుగుచేతులా సంపాదించుకుంటున్నారు. ఇలా టీడీపీ పెనుకొండ మండల కన్వీనర్ సిద్దయ్య... గుట్టుగా సాగించిన మద్యం దందాను పోలీసులు రట్టు చేశారు. అతనితో పాటు అనుచరులనూ కటకటాల వెనక్కు పంపారు. దీంతో ఆ పార్టీలోని మరోవర్గం పండుగ చేసుకుంటోంది.

వీడిన గుట్టు.. టీడీపీకి చెంపపెట్టు!

- కర్ణాటక మద్యం తరలిస్తూ దొరికిన టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య
- మరో ముగ్గురు అనుచరులకూ కటకటాలు
- సొంత పార్టీ నేతలే ఉప్పందించినట్లు ప్రచారం
- బీకే పార్థసారథికి భంగపాటు...
- సంతోషంలో వ్యతిరేక వర్గం




మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథితో టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య (ఫైల్), సిద్దయ్య టీం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం బాక్సులు

పెనుకొండ: మండలంలోని శెట్టిపల్లికి చెందిన సిద్దయ్య టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థ సారథికి, ఆయన అల్లుడు శశిభూషణ్‌కు నమ్మిన బంటు. పైకి రాజకీయ నేతగా కనిపించే సిద్దయ్య... చేసేదంతా అక్రమ దందానే. ఏళ్లుగా కర్ణాటక మద్యం అక్రమంగా జిల్లాకు తెచ్చి సొమ్ముచేసుకుంటున్నట్లు పచ్చ నేతలే బహిరంగంగా చెబుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యే, అతని అల్లుడి పేర్లు చెప్పి మద్యం దందా జోరుగా సాగించాడు.

అనంతపురంలో కాపురం.. శెట్టిపల్లి నుంచి దందా..

అక్రమార్జనే పరమావధిగా పనిచేసిన సిద్దయ్య టీడీపీ హయాంలో అడ్డంగా సంపాదించాడు. అధికారులు ఎవరైనా దృష్టి సారిస్తే బీకే పేరు చెప్పి తప్పించుకునేవాడు. కానీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సిద్దయ్య దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. పోలీసులకు భయపడి మకాం అనంతపురానికి మార్చాడు. అక్కడి నుంచే తన స్వగ్రామం శెట్టిపల్లిలో వ్యవహారాలు నడిపేవాడు. మూడేళ్లుగా కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తెస్తూ గ్రామీణుల నుంచి అందినకాడికి దండుకున్నాడు. పగలంతా అనంతపురంలో ఖద్దరు దుస్తుల్లో కనిపించే సిద్దయ్య, రాత్రి కాగానే జిల్లా సరిహద్దులోని కర్ణాటకలోని మద్యం షాపుల్లో సరుకు కొని తన స్వగ్రామానికి తరలించేవాడు. అతను స్థానికంగా కనిపించపోవడంతో పోలీసులూ పెద్దగా దృష్టి సారించలేదని తెలుస్తోంది.

ఆధిపత్య పోరుతోనే...

టీడీపీలో ఆధిపత్య పోరు వల్లే సిద్దయ్య పోలీసులకు దొరికిపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి ఎవరినీ సంప్రదించకుండానే సిద్దయ్యను పార్టీ మండల కన్వీనర్‌గా ప్రకటించారు. దీంతో మండల కన్వీనర్ రేసులో ఉన్న నేతలంతా రగిలిపోయారు. కర్ణాటక మద్యం తెచ్చుకుని అమ్ముకునే సిద్దయ్యకు మండల కన్వీనర్ పోస్టు ఇవ్వడం ఏమిటని బీకేని కొందరు ప్రశ్నించారు. ఆయన పట్టించుకోకపోవడంతో పలువురు నేతలు టీడీపీకే చెందిన ఓ నాయకురాలి వర్గంలో చేరిపోయారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ కార్యక్రమాలనూ ఎవరికి వారు నిర్వహిస్తూ ఆధిపత్య పోరు సాగించారు. పలు కార్యక్రమాల్లో సిద్దయ్యపై బాహాటంగానే విమర్శలు గుప్పించారు.

ఉప్పందించిన 'పచ్చ' నేతలు..

సిద్దయ్య అక్రమ మద్యం దందా చేయడం...అలాంటి వ్యక్తికి బీకే సహకరిస్తూ మండల కన్వీనర్ పదవి ఇవ్వడాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. ఈ క్రమంలోనే సిద్దయ్య కర్ణాటక మద్యం దందాపై పోలీసులకు పలుమార్లు ఉప్పందించినట్లు తెలుస్తోంది. అయితే మద్యం దందాలో ఆరితేరిపోయిన సిద్దయ్య... ఇన్నాళ్లూ చాకచక్యంగా తప్పించుకుంటూ వచ్చాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సిద్దయ్య తన అనుచరులతో కలిసి కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తీసుకువస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో బీకే వ్యతిరేక వర్గంలోని వారు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అలర్ట్ అయిన పోలీసులు రాత్రి 12 గంటల ప్రాంతంలో మరవపల్లి సమీపంలో సిద్దయ్యతో పాటు అతని అనుచరులు పెనుకొండకు చెందిన దూదేకుల బాషా, ధర్మవరానికి చెందిన బిర్రు ప్రశాంత్‌కుమార్, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కొప్పలకొండకు చెందిన కృష్ణారెడ్డిని పట్టుకున్నారు. మద్యం బాక్సులతో పాటు కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కూడా విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ తమకు వచ్చిన పక్కా సమాచారంతోనే దాడి చేసినట్లు పేర్కొనడం విశేషం.

కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలే టార్గెట్..

తన అనుచరులతో కలిసి కర్ణాటక అక్రమ మద్యం దందాను అత్యంత గుట్టుగా నిర్వహిస్తున్న సిద్దయ్య... కొత్తచెరువు-పుట్టపర్తి మండలాల్లోని పలు గ్రామాలను లక్ష్యంగా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక మద్యాన్ని శెట్టిపల్లికి తీసుకువచ్చిన వెంటనే తన అనుచరులతో కలిసి గ్రామాల్లో... తమకు అనుకూలంగా ఉన్న మద్యం వ్యాపారులకు చేరవేసే వాడని తెలిసింది. తాను పెనుకొండ మండల టీడీపీ కన్వీనర్ కావడం వల్ల ఆ మండలంలో వ్యాపారం చేస్తే తెలిసిపోతుందని భావించే...పక్కన ఉన్న కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ తతంగమంతా అనంతపురం నుంచే ఫోన్ ద్వారా నడిపేవాడని తెలుస్తోంది.

సంబరాల్లో మరో వర్గం..

మద్యం అక్రమ రవాణా చేస్తూ సిద్దయ్య పట్టుబడటంతో మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి వ్యతిరేక వర్గం సంబరాలు చేసుకుంటోంది. ఆ వర్గానికి చెందిన పలువురు నేతలు స్థానిక హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో సమావేశమై ఆనందోత్సాహాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఫోన్లలోనూ 'సిద్దయ్య...దొరికిపోయాడు' అని సంతోషంగా మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని తమ నాయకురాలికి ఫోన్‌లో తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు.

ట్యాబ్ వాడడం తెలీదా?

- డీఈఓకే అవగాహన లేకపోతే ఎలా?
- మీకంటే విద్యార్థులే నయం
- డీఈఓ మీనాక్షిపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం
- చిలమత్తూరు బీసీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ



డీఈఓ మీనాక్షిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

చిలమత్తూరు: ట్యాబ్‌ల వినియోగంపై కనీస అవగాహన లేకపోవడం ఏంటని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ డీఈఓ మీనాక్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం రాత్రి చిలమత్తూరులోని బీసీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లను పరిశీలించారు. ఎంత సమయం వినియోగించారు, పాఠశాలలో ఈరోజు ఏమి నేర్చుకున్నారంటూ ఆరా తీశారు. ఈ క్రమంలో మీకు ట్యాబ్ వాడడం వస్తుందా అని డీఈఓ మీనాక్షిని ప్రశ్నించారు. రాదని ఆమె తెలపడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అత్యంత సంపన్న దేశాలు కూడా చేయని సాహసం జగన్ సర్కార్ చేసిందని, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా బైజూస్‌తో ఒప్పందం చేసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందని, అలాంటప్పుడు జిల్లాలో ఏడు వేల మంది ఉపాధ్యాయులకు అథారిటీగా ఉన్న డీఈఓకు ట్యాబ్‌పై అవగాహన లేకపోవడం ఏంటని మండిపడ్డారు. ట్యాబ్ నేర్చుకోవడానికి కనీసం పది నిమిషాలు కేటాయించపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. బాధ్యతాయుతమైన పదవి భారంలా చూడటం తగదన్నారు. ఎంఈఓ నాగరాజుకు ట్యాబ్ అందించి విద్యార్థులు ఎంత సమయం వినియోగించారో చెప్పాలన్నారు. ఆయన కూడా ట్యాబ్‌ను ఆపరేట్ చేయలేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యాన్ని సహించబోనని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్జేడీ ప్రతాప్ రెడ్డి, పలువురు అధికారులు ఉన్నారు.

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



ఏఆర్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్,



డీఎస్పీ విజయ్‌కుమార్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

- పోలీసులకు నైపుణ్యం, ఫిట్‌నెస్ అవసరం
- ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: పోలీసు ఉద్యోగం నిరంతరం సవాళ్లతో కూడుకున్నదని, దాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రతి పోలీసూ సిద్ధంగా ఉండాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ అన్నారు. జిల్లా సాయుధ బలగాలకు 17 రోజుల పాటు పుట్టపర్తి పరేడ్ గ్రౌండులో నిర్వహించిన డీ మొబలైజేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఉదయం శిరసాని హిల్స్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో తొలుత ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రమశిక్షణ, సమష్టి విధులతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లాకు మంచి పేరుందని, ఇందులో ఏఆర్ విభాగం పాత్ర కీలకమైందన్నారు. జిల్లా ప్రశాంతంగా ఉందంటే గతంలో పని చేసిన పోలీసుల త్యాగాలే కారణమన్నారు. విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్ మెరుగు పరిచేందుకే ఏఆర్ సిబ్బందికి ఏటా మొబలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న ముఖ్య అంశాలను మరోసారి గుర్తు చేస్తున్నామన్నారు. పోలీసులంతా ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం యోగా, ధ్యానం క్లాసులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పరేడ్ కమాండర్ టైటాస్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పలువురు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, పలువురు ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పాత రైల్వే ప్రాజెక్టులకే నిధులు

- గత ఏడాది కన్నా ఈసారి మరీ తక్కువ
- కొత్త ప్రాజెక్టులు, రైళ్లకు అనుమతులు లేవు
- బడ్జెట్ వివరాలు వెల్లడించిన డీఆర్ఎం వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న డీఆర్ఎం వెంకటరమణారెడ్డి

గుంతకల్లు: కేంద్ర బడ్జెట్‌లో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు గత ఏడాదికన్నా తక్కువ నిధులు కేటాయించారు. బడ్జెట్ పూర్తి వివరాలను శుక్రవారం సాయంత్రం డీఆర్ఎం కె.వెంకటరమణారెడ్డి మీడియాకు వెల్లడించారు. నిర్మాణ దశలో ఉన్న పాత ప్రాజెక్టులకు మాత్రమే నిధులు కేటాయించారు. కొత్త ప్రాజెక్టులు, రైళ్లకు ఏమాత్రం అనుమతులు ఇవ్వలేదు. ఇచ్చిన నిధులతో పాత ప్రాజెక్టుల్లో కొన్నయినా పూర్తయ్యే పరిస్థితులూ కనిపించడం లేదు. నడికుడి - శ్రీకాళహస్తి కొత్తలైను, గుంటూరు - గుంతకల్లు, గుత్తి - ధర్మవరం డబ్లింగ్ లైన్లకు మాత్రమే కొంతమేర నిధులు రావడం హర్షణీయం. కడప - బెంగళూరు (వయా బంగారుపేట్) మధ్య 255 కి.మీ నూతన రైలు మార్గం బాలారిష్టాలు దాటడం లేదు. ఈ ప్రాజెక్టుకు రూ.10 లక్షలు మాత్రమే కేటాయించడం డివిజన్ అధికారులకు అంతుపట్టడం లేదు. అయితే ప్రయాణికుల భద్రతా చర్యల్లో భాగంగా రైలు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యతనిస్తూ దాదాపు రూ.1,360 కోట్లు కేటాయించారు. ఇక గుంతకల్లులోని ఎలక్ట్రికల్ లోకోషెడ్‌కు రూ.5.6 కోట్ల నిధులను కేటాయించారు.

పాత ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు

ప్రాజెక్టు పేరు	2022	2023
నడికుడి-శ్రీకాళహస్తి న్యూలైన్	రూ.1501కోట్లు	రూ.202 కోట్లు
కడప - బెంగళూరు న్యూలైన్	రూ.289 కోట్లు	రూ.10 లక్షలు
గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్	రూ.803 కోట్లు	రూ.980కోట్లు
గుత్తి - ధర్మవరం డబ్లింగ్	రూ.100 కోట్లు	రూ.90.6 కోట్లు
అంకోలా - డోన్ డబ్లింగ్	రూ. 5కోట్లు (సర్వేకు)	రూ.60 కోట్లు
మన్మాడ్ - కుడ్‌ఖేడ్ - డోన్ విద్యుదీకరణ	రూ.229 కోట్లు	రూ.315.6 కోట్లు
ధర్మవరం - పాకాల - కాట్పాడి డబ్లింగ్	---	రూ.40 కోట్లు

విదేశీ విద్యకు రాచబాట

- జగనన్న విదేశీ విద్యాదీవెన ప్రారంభం
- జిల్లాలో ముగ్గురు విద్యార్థులకు లబ్ధి
- రూ.27,17,009 మెగా చెక్కు అందజేసిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు



మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఎమ్మెల్సీ ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

పుట్టపర్తి అర్బన్: విద్యారంగానికి పెద్దపీట వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద కుటుంబాల్లోని పిల్లలు కూడా అంతర్జాతీయంగా పేరుగాంచిన యూనివర్సిటీల్లో చదువుకునేందుకు అవకాశం కల్పించారని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి కార్యాలయం నుంచి 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని ప్రారంభించగా, కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, ఈబీసీ విద్యార్థులకు ప్రభుత్వం 'జగనన్న విదేశీ విద్యా దీవెన' ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ప్రపంచంలోనే టాప్ 100 క్యూస్ ర్యాంకులున్న విశ్వవిద్యాలయాల్లో చదువుకునే వారికి రూ.1.25 కోట్ల వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. ర్యాంకు ఆధారంగా ఆయా యూనివర్సిటీల్లో చదువుకునే వారికి రూ.50 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకూ విదేశీ విద్యా దీవెన మంజూరవుతుందన్నారు. వర్సిటీ ఫీజు, ట్యూషన ఫీజు, విమాన చార్జీలు, వీసా ఖర్చులు అన్నీ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఫీజును నాలుగు విడతలుగా మంజూరు చేస్తుందన్నారు.

అర్హత ఆధారంగానే అవకాశం..

ఎమ్మెల్సీ ఇక్బాల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ప్రతి పథకాన్ని పూర్తి పారదర్శకతతో అమలు చేస్తోందన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కూడా అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని విద్యార్థులకు రూ.15 లక్షలు, బీసీ, మైనార్టీ వర్గాల్లోని విద్యార్థులకు రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వక పోవడంతో ఆయా వర్గాల్లోని విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేశారన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి ఉండదన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి ఆర్థిక సహాయం అందేలా చూస్తారన్నారు. మన విద్యార్థులు విదేశాల్లో చదివి ఉన్నత స్థానంలోకి వెళ్లినా... మన రాష్ట్రాన్ని, గ్రామాలను గుర్తు పెట్టుకోవాలన్నారు.

జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక..

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. ఇందులో ఓడీసీ మండలం అల్లాపల్లి పంచాయతీ, పగడాలవారిపల్లికి చెందిన గంగులప్ప, రత్నమ్మ దంపతుల కుమార్తె డి.అనిత (ఇటలీలో ఎమ్మెస్సీ), కొత్తచెరువు మండల కేంద్రంలోని బసవన్న కట్ట వీధిలోని శివారెడ్డి, పద్మావతి దంపతుల కుమారుడు రాజశేఖరరెడ్డి(అమెరికాలో ఇంజినీరింగ్), పెనుకొండ మండలం కొండంపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి, కవిత దంపతుల కుమారుడు భార్గవసాయి(అమెరికాలో కంప్యూటర్ సైన్స్) ఎంపికయ్యారు. వీరందరికీ కలిపి తొలి విడతలో విడుదలైన రూ.27,17,009 మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డీడీ శ్రీరాములు, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలాజ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్‌రావు, సూపరింటెండెంట్‌లు ఈరన్న, హరిత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నమ్మలేకపోతున్నా



మాది పేద కుటుంబం. ఇప్పటి వరకు నేను విమానాన్ని దగ్గరగా కూడా చూడలేదు. అలాంటిది మా కుమార్తె అనిత ఇటలీలో చదువుతుందంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నా. నా భార్య రత్నమ్మకు కిడ్నీ ఆపరేషన్ చేయడంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విదేశీ విద్యా దీవెన ద్వారా మొదటి విడతలో రూ.27,405 మొత్తాన్ని అందజేశారు.

– గంగులప్ప, అల్లాపల్లి, ఓడీసీ

కలలో కూడా ఊహించలేదు



నా కుమారుడు రాజశేఖరరెడ్డి బాగా చదివాడు. విదేశాల్లో ఉన్నత అభ్యసించాలన్నది ఆయన కల. దాన్ని నెరవేర్చే ఆర్థిక పరిస్థితి మా వద్ద లేదు. దీంతో ఉన్న రెండెకరాలు అమ్మేసి డబ్బు ఇవ్వడానికి సిద్ధపడ్డాం. అప్పుడే సీఎం వైఎస్ జగన్ విదేశీ విద్య పథకాన్ని ప్రవేశపెట్టారని సచివాలయ సిబ్బంది చెప్పారు. దీంతో దరఖాస్తు చేయగా, పరిశీలించిన అధికారులు మాకు మొదటి విడతలోనే రూ.14,88,240 మొత్తాన్ని అందజేశారు. చాలా సంతోషంగా ఉంది.

– శివారెడ్డి, పద్మావతి, కొత్తచెరువు

జగన్ చలువే



నాకున్న రెండున్నర ఎకరాల భూమి సాగు చేస్తూ... ప్రభుత్వం అందజేసే దివ్యాంగుల పింఛన్‌తోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా. నా కుమారుడు బెంగళూరులో బీటెక్ చేసే సమయంలోనే చాలా ఇబ్బందులు పడ్డాం. అలాంటి ఇప్పుడు నా కుమారుడు గుండపనేని భార్గవసాయి విదేశాల్లో చదువుకు వెళ్తున్నాడంటే అది సీఎం వైఎస్ జగన్ చలువే. మాకు తొలి విడతగా రూ.12,01,364 మొత్తాన్ని అందజేశారు.

–శ్రీహరి, కవిత, కొండంపల్లి, పెనుకొండ

క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి: సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని మంచి నాణ్యమైన భోజనాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. డ్రైడేను పాటిస్తూ జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే కుటుంబంలోని చిన్నారులు, పిల్లలకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం ఇచ్చే టీకాలను వేయించి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్ప, వైద్యాధికారి మమత, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్



పుట్టపర్తి టౌన్: అంతర్జాతీయ మండలి వాసవి క్లబ్ సీనియర్ ఉపాధ్యక్షుడిగా పుట్టపర్తి వాసి సుంకు చంద్రశేఖర్ గుప్తా ఎంపిక య్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ కన్వెన్షన్ హాల్లో జరిగిన సమావేశంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా వాసవి క్లబ్‌లో చేస్తున్న సేవ గుర్తించి ఈ పదవిని అప్పగించినందుకు సంతోషంగా ఉందని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు తనవంతు సేవలు అందిస్తానన్నారు.

రైతు అదృశ్యం

రాప్తాడు: ఆత్మకూరు మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన మజ్జిగ రామకృష్ణ కుమారుడు, యువ రైతు మజ్జిగ ఓబులేష్ అదృశ్యమయ్యాడు. బుధవారం ఉదయం మజ్జిగ ఓబులేష్ తోపుదుర్తి నుంచి రాప్తాడు మండలంలోని పాలచెర్ల సమీపంలో ఉన్న వ్యవసాయ తోట దగ్గరకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. రాత్రి 10 గంటలు అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా సెల్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్ల దగ్గర విచారించినా ఆచూకీ లభించలేదు. తదీంతో ఓబులేష్ తండ్రి రామకృష్ణ తన కుమారుడు కనిపించడం లేదని గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని రాప్తాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముందుగా గుర్తిద్దాం.. క్యాన్సర్‌ను జయిద్దాం!

- ప్రాంతాల భేదం లేకుండా విస్తరిస్తున్న క్యాన్సర్
- ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో చెక్‌పెట్టొచ్చంటున్న వైద్యులు
- ఆరోగ్యశ్రీతో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

సందర్భం: నేడు అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది క్యాన్సర్ బారినపడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతమని భేదం లేకుండా పలువురిని క్యాన్సర్ కబళిస్తోంది. ఈ వ్యాధి బారినపడి కుటుంబాలు ఆర్థికంగా సతమతమవుతున్నాయి. అయితే ముందస్తు పరీక్షలు, వైద్యం చేసుకోవడం ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: క్యాన్సర్ అంటే కణం యొక్క అనియంత్రిత (నియంత్రణ లేని) విభజన వల్ల వచ్చిన ప్రాణాంతక పెరుగుదల. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది కోటి మంది క్యాన్సర్ వల్ల మరణిస్తున్నారు. మరణాలలో క్యాన్సర్‌ది రెండో స్థానం. సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా 40 శాతం క్యాన్సర్‌లను రాకుండా నివారించవచ్చు. ముందస్తు పరీక్షలు, వైద్యం చేసుకోవడం ద్వారా 33.3 శాతం మరణాల రేటును తగ్గించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

క్యాన్సర్‌కు కారణాలు

మద్యపానం వల్ల రొమ్ము, నోరు, గొంతు, అన్నవాహిక, లివర్, కడుపు క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. అలాగే పొగాకును నమలడం, తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. చెడు ఆహారపు అలవాట్లు, శారీరక సోమరితనం వల్ల కూడా క్యాన్సర్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే హెచ్‌పీవీ వైరస్, హైపటైటిస్ బీ, సీ వైరస్, ఈబీ వైరస్, ఒబిసిటీ ఉన్న వారిలో 12 రకాల క్యాన్సర్లు వస్తాయంటున్నారు. పర్యావరణంలోని రసాయనాలు, రేడియేషన్‌తో పాటు జన్యు కారణాలు, నాన్ మోడిఫైబుల్ రిస్క్ ఫ్యాక్టర్ల ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స



ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ఉచితంగా క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తోంది. వైద్య చికిత్స కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలోనే చికిత్స తీసుకునేలా ఏర్పాట్లు ముమ్మరం చేసింది. తిరుపతి, విశాఖ, గుంటూరు–విజయవాడ మధ్య క్యాన్సర్ కేర్ హాస్పిటల్స్ నిర్మాణం, తిరుపతిలో చిన్నారులకు క్యాన్సర్ కేర్ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నారు.

నివారణ మార్గాలు

- ధూమపానం, మద్యపానం చేయకూడదు. మాంసాహారం మితంగా తీసుకోవాలి. నిల్వ ఉంచిన – మాంసాహారం, ప్రాసెస్ట్ మీట్ తీసుకోకూడదు.
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి.
- తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- శారీరక బరువును నియంత్రణలో ఉంచుకోవాలి. అందుకు తగిన వ్యాయామం ఆహారపు అలవాట్లు పాటించాలి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో క్యాన్సర్ కేసులు

సంవత్సరం	రేడియేషన్ ద్వారా చికిత్స	కిమో థెరపీ ద్వారా చికిత్స
2018	321	2057
2019	280	1760
2020	146	1130
2021	223	1968
2022	424	2050



ముందే గుర్తిస్తే మేలు



ప్రభుత్వ క్యాన్సర్ యూనిట్‌లో క్యాన్సర్‌కు సంబంధించి చికిత్సలను అందిస్తున్నాం. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. ప్రతి ఏడాది క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతోంది. తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. – డాక్టర్ ప్రశాంతి, క్యాన్సర్ యూనిట్, అనంతపురం

వ్యాక్సినేషన్‌తో ...

కొన్ని క్యాన్సర్ల వల్ల కలిగే అపాయాన్ని తగ్గించడానికి వ్యాక్సిన్లు సహాయపడతాయి. సర్వైకల్ క్యాన్సర్, యోని, వాల్వల్ క్యాన్సర్‌లు నివారించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సహాయపడుతుంది. కాలేయ క్యాన్సర్‌కు దారితీసే హైపటైటిస్ బీని నిరోధించేందుకు హైపటైటిస్ బీ వ్యాక్సిన్ సహాయపడుతుంది. దాని ద్వారా కాలేయం క్యాన్సర్ (లివర్ క్యాన్సర్) ప్రమాదాన్ని తగ్గించొచ్చు.

తప్పించుకు తిరుగుతున్న దొంగ అరెస్ట్



అరెస్టు చేసిన దొంగను చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 24 ఏళ్ల వయసు..22 చోరీ కేసుల్లో నిందితుడు. 2019 నుంచి ఇప్పటి దాకా అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాలుగు చోరీ కేసుల్లో అరెస్టు అయిన షికారీ అర్జున్ బెయిల్‌పై బయటకు వచ్చి కనిపించకుండా పోయాడు. దీంతో కోర్టు వారెంట్లు పెండింగ్ పడ్డాయి. అతడి కదలికలపై నిఘా ఉంచిన త్రీటౌన్ పోలీసులు ఎట్టకేలకు అతన్ని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ...నగరంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన షికారి అర్జున్‌పై 2016 నుంచి ఇప్పటి దాకా 22 దొంగతనాల కేసులు ఉన్నాయి. త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు చోరీలు చేశాడు. ఈ నాలుగు కేసులకు సంబంధించిన వారెంట్లు పెండింగులో ఉన్నాయి. ఎస్పీ ఫక్కీరప్ప దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి తక్షణం నిందితులను కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించారు. అందులో భాగంగా షికారి అర్జున్‌ను అరెస్టు చేసి అనంతపురం మొబైల్ కోర్టు ముందు శుక్రవారం హాజరుపరిచామని సీఐ తెలిపారు.

బైక్‌లు చోరీ చేసే ముఠా ఆటకట్టు

- ఎనిమిది మంది అరెస్టు, 36 వాహనాలు స్వాధీనం
- జువైనల్ హోంకు ఓ బాలుడు



బైక్‌లు చోరీ చేసే ముఠాను అరెస్టు చూపుతున్న డీఎస్పీ యశ్వంత్, సీఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక పోలీసు బృందం

హిందూపురం: ఇళ్ల బయట పార్క్ చేసిన బైక్‌లను ఎత్తుకెళ్లి వాటికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించే ముఠాను హిందూపురం పోలీసులు పట్టుకున్నారు. ముఠాలోని ఎనిమిది మందిని అరెస్టు చేసి, 36 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ యశ్వంత్ వెల్లడించారు. హిందూపురం సీపీఐ కాలనీకి చెందిన సయ్యద్ ఆసీఫ్, జబివుల్లా, మరో బాలుడు (17 ఏళ్లు) స్థానికంగా ఓ వెల్డింగ్ షాపులో పనిచేసేవారు. చెడువ్యసనాలకు బానిసలైన వీరు సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం రహమత్‌పురాలో ఉండే షేక్‌జబివుల్లా, సత్తార్‌ఖాన్, నూర్ మహమ్మద్, అజీజ్ ఖాన్, ముబరాక్ మహబూబ్‌బాష, ఏజాజ్‌లు ముఠా ఏర్పడి బైక్‌లు చోరీ చేసి అమ్మకాలు చేసేలా నిర్ణయించుకున్నారు. ఇందులో ఆసీఫ్, జబివుల్లా, 17 ఏళ్ల బాలుడు రాత్రిపూట ఇళ్ల ముందు నిలిపిన బైక్‌లు చోరీ చేసి తీసుకువస్తే షేక్ జబివుల్లా తన స్నేహితుడైన మహమ్మద్ ఆదిల్‌ఖాన్ ద్వారా నకిలీ ఆర్‌సీలు తయారు చేయించి మిగిలిన వారు వాహనాలను విక్రయించే వారు. వచ్చిన డబ్బును అందరూ సమానంగా పంచుకుని జల్సాలు చేసేవారు. ఇటీవల హిందూపురం పరిసర ప్రాంతాల్లో బైక్ చోరీలు అధికం కావడంతో ఎస్పీ రాహుల్‌దేవ్ ఆదేశాలతో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఓ టీం ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి శుక్రవారం సీపీఐ కాలనీ శివారులోని పాత డంపింగ్‌యార్డు వద్ద అటవీప్రాంతంలో అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు రహమత్‌పురానికి చెందిన మహబూబ్‌బాష, ఏజాజ్ పరారీలో ఉన్నారు. అలాగే ముఠా సభ్యులు విక్రయానికి సిద్ధం చేసిన 36 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బైక్‌లకు నకిలీ ఆర్‌సీలు తయారుచేసే ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్ సీపీయూ, మానిటర్, ప్రింటర్లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు. వాహనాల దొంగల ముఠాను పట్టుకున్న సీఐ వెంకటేశ్వర్లు, లేపాక్షి ఎస్‌ఐ మునీర్ అహమ్మద్‌తోపాటు ప్రత్యేక బృందానికి డీఎస్పీతోపాటు ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ అభినందించారు.

నకిలీ ఆర్సీలు సృష్టించి విక్రయాలు..

బైక్ చోరీ చేసే ముఠా నకిలీ ఆర్‌సీ సృష్టించి విక్రయిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరు వాహనాలు కొనుగోలు చేస్తామని ఓఎల్‌ఎక్స్‌లో ఆర్టీఓ ఏజెంట్స్ ద్వారా ఆర్‌సీ జిరాక్స్‌లు సంపాదిస్తారు. ఆ తర్వాత కంప్యూటర్ నిర్వాహకుడైన మహమ్మద్ ఆదిల్‌ఖాన్ అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ నుంచి ఖాళీ చిప్‌కార్డులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి ఆర్టీఓ ఏజెంట్ల ద్వారా తీసుకున్న ఆర్సీల సమాచారాన్ని చిప్‌కార్డుపై ప్రింట్ చేసి ఒరిజినల్ కార్డులా తయారుచేస్తాడు. అందువల్లే పోలీసులు వాహనాల ఆర్‌సీ చెక్‌చేసినా ఆన్‌లైన్‌లోనూ అవి మ్యాచ్ అవుతాయి. ఒరిజినల్ వాహనం ఎక్కడో ఉంటుంది. అయితే దొంగ బండి నకిలీ ఆర్‌సీపై ఇక్కడ తిరుగుతుంటుంది.

అంతర్రాష్ట్ర ఆవుల దొంగల అరెస్ట్

- నాలుగు ఆవులు, రూ.1.25 లక్షల రికవరీ



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను చూపుతున్న పోలీసులు

ఓడీ చెరువు: వివిధ గ్రామాల్లోని ప్రధాన రోడ్డు సమీపంలోని ఆవులను అపహరించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ఆవుల దొంగలను అరెస్ట్ చేసినట్లు నల్లమాడ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ గోపీ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఓడీ చెరువు, కదిరి మండలాల్లోని ముత్యాల చెరువు, గాజుకుంటపల్లి, వేమారెడ్డి పల్లి, దాదిరెడ్డిపల్లి గ్రామాల్లో గత ఏడాది సెప్టెంబర్‌లో తొమ్మిది పాడి ఆవులు అపహరించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా రెండు టీములను ఏర్పాటు చేసి నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలంలోని వేమారెడ్డిపల్లి, గాజుకుంటపల్లి, ముత్యాల చెరువు గ్రామాల్లో నాలుగు ఆవులు అపహరణకు గురైనట్లు వివరించారు. శుక్రవారం ఉదయం సున్నంపల్లి రోడ్డు సమీపంలో నాలుగు ఆవులను వ్యానులోకి ఎక్కిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడికి చేరుకుని విచారించగా రాత్రి అపహరణకు గురైన ఆవులుగా గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం జజ్జాపూర్ పోలీసుస్టేషన్ పరిధికి చెందిన కళ్లహళ్లికి చెందిన సోహైల్‌ఖాన్, ఫైరోజ్‌గా గుర్తించామన్నారు. దొంగలించిన నాలుగు ఆవులతో పాటు వారి వద్ద నుంచి రూ.1.25 లక్షల నగదు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో వాహనంలో ఉన్న ముగ్గురు దొంగలు షబ్బీర్, నవాజ్‌ఖాన్, మెహరాజ్‌ఖాన్ పరారీలో ఉన్నారన్నారు. వారు రూ. 2.10 లక్షల విలువ చేసే ఆవులను అపహరించినట్లు తేలిందన్నారు. త్వరలో వారిని పట్టుకుంటామని తెలిపారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుల్లోనూ పలు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ గోపీ, హెడ్‌కానిస్టేబుల్ రమణనాయక్, వెంకటేష్, పీసీలు అస్లాం, రమణ, అంజి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్, సాయి, ఆంజనేయులను డీఎస్పీ అభినందించినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

సురక్షిత ప్రయాణానికి కేరాఫ్ ఆర్టీసీ



ఉత్తమ డ్రైవర్‌కు అవార్డు అందజేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

హిందూపురం: ప్రైవేట్ వాహనాల సంస్థలను పోల్చితే ఆర్టీసీ వాహనాల్లో ప్రమాదాలు అతితక్కువగా ఉంటున్నాయని, సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ కేరాఫ్‌గా మారిందని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల అన్నారు. రోడ్డు భద్రతావారోత్సవాల సందర్భంగా జిల్లా, డిపోల వారీగా ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లు, ఇతర ఉద్యోగులకు ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులను అందించారు. హిందూపురం ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జోనల్ చైర్మన్, ఎంవీఐ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధులకు హాజరుకావడానికి అరగంట ముందుగా డిపోకు వచ్చి బస్సు కండీషన్ చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. బస్సులో ప్రయాణించే 60 మంది కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిబంధనలు పాటిస్తూ బస్సును నడపాలన్నారు. 2021 లెక్కల ప్రకారం ఎక్కువగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయని, బస్సుల ప్రమాదాలు 9 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. అందులోనూ ఆర్టీసీలో 0.6 శాతంగా ఉందన్నారు. వచ్చే రోజుల్లో సున్న శాతం లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్లు, బస్సుల్లో ప్రయాణించే సమయంలో సీటు బెల్టు వేసుకుని ఇరుపక్కలా గమనిస్తూ డ్రైవ్ చేయాలన్నారు. ద్విచక్రవాహనంలో వెళ్లే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం జిల్లా, డిపోల వారీగా ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందించి సన్మానించారు.

నేటి నుంచి విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నేటి నుంచి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టీ–20 టోర్నీని నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మధుసుధన్ నాయక్ తెలిపారు. అనంత క్రీడా మైదానం వేదికగా రెండు రోజుల పాటు పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ టోర్నీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నీలో ఆంధ్ర ఏ, ఆంధ్ర బీ జట్లు పాల్గొంటాయన్నారు. క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీటీ సీబీఆర్ డైరెక్టర్ దశరథ్, 45వ డివిజన్ కార్పొరేటర్ చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, మధు అతిథులుగా హాజరవుతారన్నారు. విభిన్న ప్రతిభావంతుల టీ–20 క్రికెట్ మ్యాచులతో పాటు, సకలాంగులతో క్రికెట్ మ్యాచ్ ఉంటుందన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడులో శుక్రవారం శివాలయం ముందర ధ్వజస్తంభం ప్రతిష్ట విరిగిపోయిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామంలో తెల్లవారుజామున శివాలయం ముందు క్రేన్ సహాయంతో నూతనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ట చేస్తుండగా ధ్వజస్తంభం మధ్య భాగం విరిగిపోయింది. అయితే ఆ సమయంలో భక్తులు దూరంగా ఉండడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది.

పశుసంపద పరిరక్షణపై దృష్టి



అవార్డులు అందజేస్తున్న అధికారులు సుబ్రహ్మణ్యం, శుభదాస్, రామచంద్ర

అనంతపురం అగ్రికల్చర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నియోజక వర్గాల వెటర్నరీ ప్రయోగశాలల ద్వారా పశుసంపద, జీవసంపద పరిక్షణే ధ్యేయంగా పనిచేయాలని పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల అధికారులు వై.సుబ్రహ్మణ్యం, శుభదాస్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఉన్న జిల్లా స్థాయి పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో ఏడీ ఎస్.రామచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 16 మంది టెక్నికల్ సిబ్బందికి ప్రతిభా అవార్డులు అందజేశారు. వారు మాట్లాడుతూ... ప్రతి నియోజక వర్గ కేంద్రంలో వెటర్నరీ ల్యాబ్ ఉన్నందున ఎక్కడా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి ల్యాబ్‌లో ఉన్న వివిధ రకాల జబ్బులకు సంబంధించి వ్యాక్సినేషన్లు, కెమికల్స్, సామగ్రికి పరిశీలించి అవసరమైన మేరకు నియోజక వర్గాల ల్యాబ్‌లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఎస్‌లు డాక్టర్ పీజే శృతి, పి.ఉషా కిరణ్, 13 నియోజక వర్గాల వెటర్నరీ ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపికకు పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన వారు ఈ నెల 10 నుంచి 12 వరకు కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ ఇన్‌చార్జ్ కార్యదర్శి పూలప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపికైన బాలుర జట్టు: షౌకత్‌వలి, అవినాష్, కుమార్, సుధీర్, రాహుల్, విజయ్, ఆకాష్‌రెడ్డి, హర్షవర్ధన్, గణేష్, గిరీష్‌వర్ధన్, శ్రీనాథ్‌రెడ్డి, సాయితేజ

బాలికల జట్టు: బి.జోష్నా, స్వాతి, ప్రవల్లిక, పూజిత, మీనా, హిమబిందు, రోషిని, హసీనా, తీర్థా, నందినిబాయ్, భారతిబాయ్, సబీనా, సుహాసిని, జోష్న, మైత్రి, మమత, నాగదీప్తి.